# సమన్వయంతో పని చేయాలి



జడ్పీ సభ్యులతో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులు

- ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- హరితహారం చెట్లను నరికివేయొద్దు
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- దవాఖానల్లో మందులు అందుబాటులో ఉంచాలి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, జూన్ 19: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగా, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. విద్యుత్ సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు, మిషన్ భగీరథ నీరు, సీజనల్ వ్యాధులపై ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ శాఖపై సమీక్ష ప్రారంభం కాగానే సంబంధిత అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ, 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్న క్రమంలో కరెంట్ కట్ అయింది. దీంతో సభలో సభ్యులంతా నవ్వుకున్నారు. ఇదేనా నాణ్యమైన విద్యుత్ అంటూ ప్రశ్నించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయని, విద్యుత్ తీగల కింద ఉన్నాయని నరికివేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులు మాట్లాడుతూ, చెట్లను పూర్తిగా కొట్టివేయమని, అలాంటి ఘటనలు ఇకపై జరిగితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానల్లో కాన్పులు పూర్తిగా తగ్గిపోయాయని, కేసీఆర్ కిట్, గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లు అందించడం లేదన్నారు. మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో మందులు లేవని, దవాఖానల్లో వైద్య సేవల విషయంలో జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమీయొద్దీన్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మందుల కొరత ఉందని, త్వరలో పూర్తి స్థాయిలో సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే, కోరుట్ల మండలం నాగులపేట సైఫన్ సమీపంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని అదనపు కలెక్టర్ రాంబాబుకు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ఫిర్యాదు చేయగా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పెట్టించాలని, ఎకిన్‌పూర్ పాఠశాలలో అటెండర్‌ను నియమించాలని సూచించారు.

### జడ్పీ సభ్యులకు ఆత్మీయ సత్కారం

ఐదేళ్ల పాలన ఉగాది పచ్చడిలా సాగిందని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జడ్పీ సభ్యుల పదవీ కాలం ముగుస్తుండగా, సమావేశం అనంతరం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో జగిత్యాల జిల్లా ఏర్పడి, తనకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం లభించిందన్నారు. జిల్లాల విభజన అనంతరం, కలెక్టరేట్ నిర్మాణం, జిల్లాకు మెడికల్ కళాశాల ఇవన్నీ కేసీఆర్ చొరవతోనే సాధ్యమైందన్నారు. ఐదేళ్లలో తనకు తోడ్పాటునందించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జడ్పీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, జడ్పీ సభ్యులు భవిష్యత్‌లో మంచి పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించారని కొనియాడారు. అనంతరం దావ వసంతను ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ సభ్యులు, జడ్పీ సిబ్బంది, పాత్రికేయులను దావ వసంత శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు, అదనపు కలెక్టర్ రాంబాబు, జడ్పీ సీఈవో రఘునందన్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, లోకబాపు రెడ్డి, జడ్పీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

జగిత్యాల, జూన్ 19: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు సక్ష్యం స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దయాకర్ జీ పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా దివ్యాంగ సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సక్ష్యం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాటిపాముల సురేశ్ కుమార్, జిల్లా కార్యదర్శి కూర్మాచలం రఘునందన్, గడ్డం మహిపాల్ రెడ్డి, అశోక్ రావు, గాలిపెల్లి నర్సయ్య, నాగభూషణం, చిత్తారి మధుకర్, కస్తూరి శ్రీధర్, కొలిచాల రవీందర్, కస్తూరి వెంకటరమణ, వేముల చంద్రశేఖర్, మధురిమ, సాగర్ పాల్గొన్నారు.

## నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

జగిత్యాల రూరల్, జూన్ 19: జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని పొలస్తేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు గురువారం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

## వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

జగిత్యాల టౌన్, జూన్ 19: రాష్ట్రంలో వృద్ధులు ఆత్మహత్యకు పాల్పడితే విచారణ జరిపించాలని తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ఆత్మహత్యలు, అభద్రత, నివారణ' అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో పీసీ హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, కొయ్యడ సత్యనారాయణ, సతీశ్, కిషన్, సింగం గంగాధర్, భూమయ్య, నక్క ఇంద్రయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

## ఏడీఈపై చర్యలు తీసుకోవాలి

వెల్గటూర్, జూన్ 19: వెల్గటూర్, రాజారాంపల్లి సెక్షన్ల పరిధిలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని ధర్మపురిలోని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ కార్యాలయానికి వెళ్తే ఏడీఈ సింధూర్ శర్మ తమ పట్ల అనుచితంగా ప్రవర్తించి వెళ్లగొట్టినట్లు మహాలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ (కరీంనగర్)కు చెందిన సాన రఘు తెలిపారు. ఏడీఈపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎస్ఈకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

# అంజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



మల్యాల: అంజన్న ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మల్యాల, జూన్ 19: కొండగట్టు అంజన్న ఆలయాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అంజన్న ఆలయానికి రాగా, ఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎంపీ ఎన్నికల సమయంలో అంజన్న ఆలయంలో ముడుపు కట్టిన బండి సంజయ్ ముడుపు విప్పి స్వామి వారి సన్నిధానంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి విషయంలో ఆలయ అనువంశిక అర్చకులు, అధికారులు, దాతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, ఆర్డీవో మధుసూదన్, ఆలయ ప్రధానాచార్యులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రంగన్న, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, నాయకులు సుద్దాల దేవయ్య, మోరపల్లి సత్యనారాయణ రావు, బొట్ల ప్రసాద్, బింగి వేణు, శ్రవన్‌రెడ్డి, గాజుల మల్లేశం, కొల్లూరి గంగాధర్, కెల్లేటి రమేశ్, సంగాని రవి, బొబ్బిలి వెంకటయాదవ్, గుండేటి గంగారాం, రాజురెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నరసింహుడి సన్నిధిలో పూజలు

కొడిమ్యాల, జూన్ 19: నల్లగొండలోని లక్ష్మీనరసింహ స్వామిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, చైర్మన్ చెన్నాడి సత్యనారాయణ, తహసీల్దార్ రాజమణి, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు డబ్బుతిమ్మాయిపల్లి తాజా మాజీ సర్పంచ్ డబ్బు రాధ-గౌతంరెడ్డి ఇంటికి వెళ్లగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన

పెగడపల్లి, జూన్ 19: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై మండలంలోని వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నరేశ్ మాట్లాడుతూ, ఏడాది నుంచి 19 ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ, వైద్య సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జయశీల తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కొడిమ్యాల, జూన్ 19: నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బుధవారం ఆలయ చైర్మన్ చెన్నాడి సత్యనారాయణరావు, ఈవో ఉడుతల వెంకన్న వినతి పత్రం అందజేశారు. గుట్టపైకి తారు, సీసీ రోడ్డు, ఇరువైపులా సైడ్ డ్రైనేజీ నిర్మాణం, పురాతన ఆలయ అభివృద్ధితో పాటు గుట్ట కింద ఆలయం చుట్టూ ప్రకార మండపం, డార్మెంటరీ హాల్, వీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస్ చారి, మనోజ్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

కథలాపూర్, జూన్ 19: అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఏడీఈ రాంకుమార్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాల్లో బుధవారం ఆయన విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ రాంకుమార్ మాట్లాడుతూ, విద్యుత్ మీటర్లతోనే గృహాలకు విద్యుత్ వినియోగించాలన్నారు. అక్రమంగా కనెక్షన్ తీసుకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో అధికారి శ్రీనివాస్, ఏఈ జమీల్‌పాషా, కానిస్టేబుల్ గోపాల్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో విజిలెన్స్ ఏడీఈ రాంకుమార్

## ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణు

సారంగాపూర్, జూన్ 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నామని, విద్యార్థులు చేరాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొంక వేణు కోరారు. కళాశాలలో బుధవారం ఆయన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొంక వేణు మాట్లాడుతూ, కళాశాలలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రాజేందర్, సౌజన్య, వెంకటేశ్వర్లు, సుజాత, సతీశ్, రాజ్‌కుమార్, రజిత, నాగేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

CHANGE OF NAME
I, ERRABELLI SAMPATH RAO (New Name) Previously called A. SAMPATH RAO (Old Name) and R/o H.No. 1-107, Gandrapalli (Vill), Jammikunta (Mdl), Karimnagar Dist. - 505 475, T.S., India Solemnly declare.

సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311301

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## యువత అన్ని రంగాల్లో రాణించాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్

మల్లాపూర్, జూన్ 19: గ్రామాల్లోని యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గణవేని మల్లేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. రేగుంట గ్రామంలో బుధవారం ఆర్‌పీఎల్-2 క్రికెట్ సీజన్ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మొగిలిపేట వీడీసీ చైర్మన్ మహబూబ్‌ఖాన్, రాజేశ్, వినోద్, నవీన్, శ్రీనివాస్, నిఖిల్, సురేశ్, సతీశ్, శేషు, రాందాస్, రాజు, నరేశ్, తిరుపతి, నితీన్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

సారంగాపూర్, జూన్ 19: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి భీమ్ కుమార్ ఆధ్వర్యంలో పోతారం పంచాయతీ పరిధిలోని గణేశ్‌పల్లిలో గ్రామస్తులకు, ఉపాధిహామీ కూలీలకు బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్, కళాకారులు మహిపాల్, మల్లిక్ తేజా, రాజేందర్, ప్రవీణ్, సురేశ్ నాయక్, అశోక్, రమేశ్, పోచయ్య, రాజ్‌కుమార్, రమ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్‌కు వినతి

కోరుట్ల, జూన్ 19: రాష్ట్ర ప్రభుత్వం భూములు, ప్లాట్ల మార్కెట్ విలువ పెంపుదల యోచన నిర్ణయాన్ని విరమించుకోవాలని బుధవారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌రాజుకు రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జలయోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మారుతీనగర్, జూన్ 19: జలయోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు, సైకాలజిస్టు డాక్టర్ రాజరత్నాకర్ పేర్కొన్నారు. బుధవారం మెట్‌పల్లిలో నీటిలో యోగాసనాలపై ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న జలయోగాసనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బడి బాట కార్యక్రమం

జగిత్యాల టౌన్, జూన్ 19: జిల్లా కేంద్రంలోని కొత్తవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, మధ్యాహ్న భోజనంతో పాటు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తారని తెలిపారు. బడీడు పిల్లలను గుర్తించి, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించారు.



ఆటోకు మైక్ బిగించి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మేడిపల్లి, జూన్ 19: భీమారం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన ఉరుమడ్ల సతీశ్‌కుమార్ (31) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉరుమడ్ల సతీశ్‌కుమార్ అప్పులు చేసి గల్ఫ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పులు తీవ్రం కావడంతో తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సతీశ్‌కుమార్‌కు భార్య మహాన్ని, 7 నెలల కుమారుడు ఉన్నారు. మహాన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

## కార్యవర్గం



మేడిపల్లి: మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మేడిపల్లి, జూన్ 19: మండల కేంద్రంలో బుధవారం మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జిల్లా రమ్య, ఉపాధ్యక్షురాలిగా దేశవేని రమ్య, కార్యదర్శిగా ఆర్మూర్ లత, డైరెక్టర్లుగా తోపారపు రేఖ, తోపారపు మానస, ఐలేని లావణ్య, ఆర్మూర్ లత, దువాక రజిత, ఆర్మూర్ సూరమ్మ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాపూర్, జూన్ 19: మండలంలోని వాల్గొండ గ్రామంలో గంగపుత్ర సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మల్లేశం తెలిపారు. అధ్యక్షుడిగా పందిరి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఉట్నూర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం మహేందర్, కోశాధికారిగా లంబాడిపల్లి రాజేందర్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

## దవాఖానలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ

జగిత్యాల అర్బన్, జూన్ 19: జగిత్యాల జిల్లా ప్రధాన దవాఖానలో ఉద్యోగుల జీపీఎఫ్‌కు సంబంధించిన నిధులు గోల్‌మాల్ చేశారని ఆరోపణలు రావడంతో బుధవారం బైంసా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ విచారణ చేపట్టారు. పలు రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

## డీఈవోకు వినతి

జగిత్యాల టౌన్, జూన్ 19: స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లలో మిగిలిన పోస్టులకు కూడా ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డికి తపస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల టౌన్, జూన్ 19: జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీలో సీటు సాధించిన విద్యార్థి అనిరుద్‌రెడ్డిని బుధవారం ప్రిన్సిపాల్ దాసరి నాగభూషణం, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

## ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి

పెగడపల్లి, జూన్ 19: మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి లభించినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెగడపల్లి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ సుబ్బారావు నంచర్ల పీఎస్‌కు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా, వెంగళాయిపేట పీఎస్ ఎస్జీటి పద్మనాభం ఎండపల్లి మండలం గొడిశెలపేట పీఎస్‌కు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా, దోమలకుంట పీఎస్ ఎస్జీటీ రమేశ్ గొల్లపల్లి మండలం దట్నూరు యూపీఎస్ స్కూల్ అసిస్టెంట్‌గా, కొండాయపల్లి పీఎస్ ఎస్జీటీ శంకరయ్య మల్యాల మండలం తక్కళ్లపల్లి పీఎస్‌కు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందినట్లు వివరించారు. పెగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ రమేశ్, ఇదే పాఠశాలలో పీడీగా, బతికపల్లి పీఈటీ శివకృష్ణ కొడిమ్యాల మండలం నమిలకొండ జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగా ఉద్యోగోన్నతి పొందినట్లు పేర్కొన్నారు.


## షీ టీంలపై అవగాహన

జగిత్యాల రూరల్, జూన్ 19: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం షీ టీంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఆధ్వర్యంలో మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ అయాజ్‌ఖాన్ పేర్కొన్నారు. కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

మేడిపల్లి, జూన్ 19: మండల కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీలో బుధవారం 9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సివిల్ సప్లయ్ నాయబ్ తహసీల్దార్ కే ఉమాపతి, శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు మోతె తరుణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని ఎఫ్‌పీ షాపు నంబర్ 2713002లో భద్రపరిచినట్లు తెలిపారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ అజయ్ కుమార్ ఉన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

రాయికల్, జూన్ 19: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుకాణాల్లో స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి ఎరువుల క్రయ విక్రయాల వివరాలు నమోదు చేయాలన్నారు. లైసెన్స్ పత్రం గోడకు అమర్చాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కేక్ కట్ చేసి.. అభిమానం చాటి



మెట్‌పల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మెట్‌పల్లి/కోరుట్ల/రూరల్/రాయికల్/మల్లాపూర్/మేడిపల్లి/పెగడపల్లి/కథలాపూర్, జూన్ 19: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పలు చోట్ల అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ప్రతిభ



విద్యార్థినికి స్కాలర్ షిప్ పత్రాన్ని అందజేస్తున్న జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు

సారంగాపూర్, జూన్ 19: రాష్ట్రంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ నిర్వహించిన సూపర్-20 స్కాలర్ షిప్ పరీక్షలో బీర్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వేదశ్రీ ప్రతిభ చూపారు. పాఠశాలలో బుధవారం వేదశ్రీకి జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ్, ప్రధానోపాధ్యాయుడు నర్సింహామూర్తి స్కాలర్ షిప్‌కు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా వేదశ్రీకి రెండేళ్ల పాటు ఐఐటీ, జేఈఈలో ఆన్‌లైన్ కోచింగ్ ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

కోరుట్ల రూరల్, జూన్ 19: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోటె రాజేశ్ హత్య కేసులో 8 మంది నిందితులను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజేశ్‌కు తండ్రి గంగరాజం, తమ్ముడు రాకేశ్ మధ్య కొద్ది రోజులుగా భూ వివాదం నడుస్తున్నది. అట్టి వివాదాస్పద స్థలంలో రాజేశ్ ఆదివారం బాత్‌రూం నిర్మాణం చేపట్టగా, గొడవ జరిగింది. ఈ క్రమంలో మాటామాట పెరిగి రాజేశ్‌పై తండ్రి గంగరాజం, తమ్ముడు రాకేశ్‌తో పాటు అతని భార్య మానస, చిన్నమ్మలు, బాబాయిలు కోటె మల్లు, మంచాల లక్ష్మి, కోటె గంగరాజం, మంచాల రాజేశం, రాకేశ్ స్నేహితుడు లింగంపల్లి నరేశ్ దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన రాజేశ్ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య లాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మోహన్‌రావుపేట-వల్లంపల్లి గ్రామాల మధ్య నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్, జూన్ 19: ధర్మపురి మండలం ఆరెపల్లి నుంచి బీర్‌పూర్ మీదుగా జగిత్యాలకు అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సారంగాపూర్ అటవీ ప్రాంతంలో బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ సిద్ధు, యజమాని వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.